క్లుప్తంగా

బాధితులకు వితరణ

బొల్లాపల్లి: అగ్నిప్రమాదం సంభవించి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబానికి బీద చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు శనివారం అండగా నిలిచారు. మండలంలోని గుట్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకొని పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు బీ ద ఛేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వంట సామగ్రి, బట్టలు, కూరగాయలు, నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వై. ఆదాం, సేవా సంస్థ నిర్వాహకులు, పి. సురేష్, చిన్నకొండ, మల్లికార్జునరెడ్డి, వెంకట్రావు, హేమంత్, బ్రహ్మారెడ్డి, రవి పాల్గొన్నారు.

వినుకొండలో నేడు పుష్ప యాగం

వినుకొండ టౌన్: కార్తిక మాసోత్సవం, శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో కొలువైవున్న అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఆదివారం పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రవణ్ కుమార్ శనివారం తెలియచేశారు. కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ, సుబ్బారావు, కాళ్ళ రామ కోటేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చేసిన మంచిని వివరించేందుకే బస్సుయాత్ర

సామాజిక బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి పిలుపు

నరసరావుపేట: గత నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచిని వివరించేందుకే సామాజిక సాధికార బస్సుయాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 20న సోమవారం నరసరావుపేటలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే సామాజిక సాధికార యాత్రను పురస్కరించుకొని శనివారం ప్రకాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. పట్టణంతో పాటు ప్రతి గ్రామం నుంచి వందలాదిగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా పల్నాడు బస్టాండ్ సెంటర్‌లోని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ఆర్‌కేటీ కాలనీ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు సామాన్య ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతారన్నారు. సాయంత్రం ఆరు గంటలకు పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభలో జగనన్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు చేసిన మంచిని వివరిస్తారన్నారు. హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ఎస్ఎస్ఎన్ కళాశాలలో భోజన సదుపాయం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. దీనిని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మహాసభలు జయప్రదం చేయండి

శావల్యాపురం: గురజాలలో ఈనెల 26న జరగనున్న యూటీఎఫ్ పలనాడు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక మండల వనరుల కేంద్రం ప్రాంగణంలో గోడ పత్రికలు ఆవిష్కరించినట్లు మండల యూటీఎఫ్ అధ్యక్షులు గూడ్లూరి ప్రసాదు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.సురేష్, డి.రవికుమార్, ఏ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ మండల శాఖ నాయకులు

కులగణనకు సహకరించాలి

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన కులగణన ద్వారా బీసీలకు రాజ్యాధికారం పొందే అవకాశం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఏపీ రాష్ట్ర బొందిలి సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ శనివారం పేర్కొన్నారు. సుమారు 92 ఏళ్ల అనంతరం కులగణన చేపట్టడం జరిగిందన్నారు. ఈ గణన ద్వారా ఏ కులం వారు ఎంతమంది ఉన్నారనే విషయం స్పష్టమౌతుందన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగు పెట్టని కులాలకి ఎమ్మెల్యేగా ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో ఎక్కువ అవకాశాలు వస్తాయన్నారు. కులగణనని పెద పండుగగా భావించి అందరూ బాధ్యతగా ప్రభుత్వానికి సహకరించి వినియోగించుకోవాలని కోరారు.

వినుకొండలో సహకార వారోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన నూజెండ్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. సహకార సంఘాల్లో రైతులకు సబ్సిడీపై ఎరువులు, తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను ప్రతిఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం సీఈవో గంగినేని శ్రీనివాసరావు సహకార సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ములకలూరు సర్పంచ్ కంచర్ల బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జడ్డా రామయ్య, అమర ఏడుకొండలు, వంగూరి హనుయ్య, గాదె నాగార్జునరెడ్డి, చిట్టి గురువారెడ్డి, కుందూరి హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, సభ్యులు

సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వామ్యం కావాలి

ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపు ఇచ్చారు. పట్టణంలోని సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని వాసవీ కళ్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అన్నీ తరగతులకు లబ్ధి చేకూరేలా సుపరిపాలన సాగిస్తోందన్నారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలనేది ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందుకు అనుగుణంగానే వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కార్యక్రమాలను చేపట్టారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు దక్కిందని గుర్తుచేశారు. గతంలో వెల్లంపల్లి శ్రీనివాసరావుకు మంత్రి పదవి, ప్రస్తుతం కోలగట్ల వీరభద్ర స్వామికి డిప్యూటీ స్పీకర్‌గా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ఇచ్చి గౌరవించారన్నారు. తమ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోగలుగుతున్నారన్నారు. నాగార్జునా యూనివర్సిటీ సెనేట్ మెంబర్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరావు, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఏపీ డ్రగ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వురా భాస్కర్ రావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్, గాదంశెట్టి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి దివ్వెల రామకృష్ణ, మాట్లాడగా, పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వేర్వేరు ప్రాంతాల్లో గ్రంథాలయ వారోత్సవాలు

బొల్లాపల్లి: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బొల్లాపల్లి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో లీలావతి, లైబ్రేరియన్ ఆర్ సేవా నాయక్‌లు విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాల గురించి వివరించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేయడం అలవరుచుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

వినుకొండ(నూజెండ్ల) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శనివారం బాలుర ఉన్నత పాఠశాల నందు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు గోపిచంద్, పాఠశాల ప్రిన్సిపాల్ హావిలా పాల్గొని గ్రంథాలయాల ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భూక్యా బద్రీనాయక్ పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పంట కోత ప్రయోగంపై శిక్షణ

నాదెండ్ల: ఖరీఫ్‌లో సాగైన పత్తి, మిర్చి, వరి, కంది, మినుము, జొన్న తదితర పంటల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని జిల్లా సహాయ గణాంకాధికారి జె.సత్యనారాయణ చెప్పారు. నాదెండ్ల రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బాల్య వివాహాలు నేరం

బొల్లాపల్లి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మనంపాడు జడ్పీహైస్కూల్‌లో బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కె. రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ.శ్రీదేవిలు బాల్య వివాహ నిరోధక చట్టం 2005 ప్రకారం 18 ఏళ్లు నిండేవరకు వివాహం చేయరాదని తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రధానంగా తల్లిదండ్రులు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం, చదివిద్దాం అనే నినాదంతో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆడుదాం-ఆంధ్రా' విజయవంతం చేయండి

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించటానికి ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమ నిర్వహణ పై మండలస్థాయి సమావేశం నిర్వహించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల సత్తా

చిలకలూరిపేట: అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని కావూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 17న అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో పలు విభాగాల్లో కావూరు హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటారు. షాట్‌పుట్‌లో షేక్ అబిలాష్ ప్రథమస్థానం, కె వెంకటమోహన్ తృతీయస్థానాల్లో నిలిచారు. లాంగ్‌జంప్‌లో షేక్ మొహమ్మద్ రఫీ, షేక్ అబిలాష్ వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాల్లో విజేతలయ్యారు. విజేతలతో పాటు పాఠశాల పీడీ బి తిరుమలబాయిని హెచ్‌ఎం ఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

సంక్షిప్తంగా...

విద్యుత్ మీటర్లు బయట ఏర్పాటు చేయాలి

చిలకలూరిపేట: రీడింగ్ తీసేందుకు అనుకూలంగా ఇప్పటి వరకు లోని వైపు విద్యుత్ మీటర్లు ఉన్నవారు సంబంధిత మీటర్లను బయటవైపు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశం డిసెంబర్ 31వ తేదీ వరకు కల్పించబడిందన్నారు. తదుపరి లోని వైపు ఉన్న మీటర్ల సర్వీసు కనెక్షన్లు తొలగిస్తామన్నారు.

15 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు

యడ్లపాడు: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సుమారు 3 లక్షల మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై హనుమారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మండలంలోనూ డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు సచివాలయ స్థాయిలో ఉంటాయన్నారు.

రేపు డయల్ యువర్ డీపీటీవో

నరసరావుపేట: ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 20వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీపీటీవో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం పేర్కొన్నారు. సమస్యలు, మెరుగైన సేవలను 99592 25664లకు ఫోన్‌చేసి తెలియచేయాలని కోరారు.

తైక్వాండో పోటీలకు 14 మంది ఎంపిక

నరసరావుపేట: యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్‌చే గుర్తించబడిన స్త్రైర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ తైక్వాండో పోటీలలో 14మంది క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని కాంచన అకాడమీ డైరక్టర్, కోచ్ కాంచన, రవిశంకర్ శనివారం వెల్లడించారు. ఈనెల 15న రేపల్లెలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలకు అన్నీ రాష్ట్రాల నుంచి 300మంది క్రీడాకారులు హాజరుకాగా కాంచన తైక్వాండో అసోసియేషన్ నుంచి వివిధ కేటగిరీలలో 23మంది పాల్గొన్నారన్నారు. వారిలో 14మందికి గోల్డ్‌మెడల్స్, నలుగురికి సిల్వర్, ఐదుగురికి బ్రాంజ్‌మెడల్స్ పొందారన్నారు. గోల్డ్ మెడల్ పొందిన విద్యార్థులు ఈనెల 30 నుంచి డిసెంబరు 10వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

చినకంచర్లలో బైకు చోరీ

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఇంటి బయట పార్కింగ్ చేసిన బైకును గుర్తు తెలియని వ్యక్తులు అపహరణ చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు మేరకు గ్రామానికి చెందిన నాగులపాటి పేరయ్యకు చెందిన రూ. లక్ష రూపాయాలు విలువ చేసే స్ప్లెండర్ బైకు తాళం పగలకొట్టి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బైకు చోరీ చేశారు.

కుస్తీ పోటీలకు కేబీఆర్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: డిగ్రీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల కుస్తీ జట్టుకు కాసుబ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వినాగిరెడ్డి శనివారం తెలిపారు. వై.శ్యాంసన్, అరవై కేజీల విభాగంలో, డి.ధర్మానాయక్ ,65 కేజీల విభాగంలోను ఎంపికైనట్లు వివరించారు. 25న కాలికట్ విశ్వవిద్యాలయంలో జరగనున్న పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

పురోగతిపై క్షేత్రస్థాయిలో చర్యలు

శావల్యాపురం: కుల గణాంకాల ప్రక్రియ పురోగతిపై క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామని తహసీల్దారు షేక్ జాన్ సైదులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ కుల గణాంకాల సర్వేలో బీఎల్‌వోలు ప్రమేయం ఉండరాదన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో వలంటీర్లు కుల గణాంకాల సర్వే నమోదు డిసెంబరు 3 నాటికి పూర్తి చేసి వలంటీర్లు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నరసరావుపేట రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉప్పలపాడు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల పీఈటీ రామకృష్ణారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

చిలకలూరిపేట: వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ హైస్కూల్ ప్రాంగణంలో గత ఐదు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్ బాల్ జట్ల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ఏఎంజీ సంస్థ సీఈవో మాసిలామణి, స్కూల్ హెచ్‌ఎం కృపాదానం, వ్యాయమ ఉపాధ్యాయులు రాజు, రాజేష్, కోచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.